

# కథా కౌముది

## బహురూపి దేశరాజ



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

ఇంటి నిండా వున్న చీకటి, ఇరుకుదనం, రాత్రి అలసట కలిసి అతడిని ఆ పట్టపగలు గాఢ నిద్రలోకి తీసుకువెళ్లాయి. అలా అతడు ఆదమరిచి నిద్రపోతున్న వేళ జరిగింది ఆ సంఘటన.

మొదట ఏదో కలేమో అనుకున్నాడు. తరువాత ఎవరైనా టీవీ ఎక్కువ సౌండ్ పెట్టారేమో అని కూడా అనుకున్నాడు. కానీ, అది మామూలు శబ్దం కాదు. ఎవరో స్త్రీ హృదయ విదారకంగా ఏడుస్తున్న శబ్దం. కడుపులోంచి దుఃఖం పొంగిపొర్లినట్టు విషాదం నిండి వుందా గొంతులో.

అర్థమవుతున్నా, నిద్ర మత్తులో వుండటం వల్ల గబుక్కున లేవలేకపోయాడు. తరువాత ఇంకా ఏవో అరుపులు, పెద్ద పెద్ద చప్పుళ్లు వినడపడటంతో ఉలికిపాటుగా లేచి మంచం దిగాడు. నిద్ర మత్తు వల్ల కాస్త తూలి పక్కనున్న గోడ పట్టుకు నిలబడి, కళ్లు చికిలించుకుని జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లి చొక్కా తగిలించుకున్నాడు.

అది మరీ ఎండాకాలమేమీ కాదు. కానీ, హైదరాబాద్ లాంటి మహానగరంలో.. అందులోనూ అగ్గిపెట్టెలాంటి అపార్ట్ మెంట్‌లో చలికాలం వెచ్చగా వున్నా, మిగిలిన కాలమంతా ఉక్కపోతగానే ఉంటుంది. దానికితోడు పట్టపగలు కూడా లైట్లు వేసుకోవాల్సిన పరిస్థితి. ఎందుకంటే, ఏ గది కిటికీలను తెరుచుకోలేం. తెరిచినా వెలుతురు సరేసరి, గాలి కూడా రాదని ఎవరైనా గ్యారెంటీగా చెప్పేయగలరు.

బెడ్రూములు రెండూ పిల్లలు ఆడి వదిలేసిన వస్తువులతో, చదవకుండా వదిలేసిన పుస్తకాలతో చిందరవందరగా వున్నాయి. హాలు అన్న పేరేగానీ, డైనింగ్ టేబుల్, రెండు కుర్చీలు తప్ప ఏవీ పట్టనే పట్టవు. కానీ, అక్కడే ఓ గ్యాస్

సిలిండర్, ఓ పేపర్ ర్యాక్ కూడా అమర్చి తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారు ఆ దంపతులు. ఇక వంటింటి గురించి చెప్పుకోవడానికేమీ లేదు. ఎక్కడికక్కడ జిడ్డు, పొడులు, మసి గుడ్డలతో కంగాళీకే కంగారెత్తించేలా వుంటుంది. కొత్తవారే కాదు, ఆ ఇంట్లోని వారైనా కాస్త చూసుకోకుండా విసురుగా అటూ నుంచి ఇటు తిరిగితే సామాన్లన్నీ చిందర వందరగా పడటం ఖాయం.

'ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలి' అని ఏ పనికిమాలినవాడు అన్నాడోగానీ.. అది ఆ ఇంటావిడకి అస్సలు నప్పదు. ఎందుకంటే ఆమె అంత ఒబ్బిడిగా వుంటుంది. కుదిరితే ఇంటినీ కూడా అద్దంలా పెట్టేదే, కానీ కుదరొద్దూ? ఇంకా ఆ ఇంటి ఈఎమ్ఐ తీరకపోవకపోవడం వల్లననుకుంట వాళ్లు దాన్ని అందమైన పొదరిల్లుగానే భావిస్తారు. ఇంటికి ఎవరైనా వచ్చినా, పిల్లల పుట్టినరోజులు జరిపినా ఆ హాల్లోనే అన్నీ అలంకరించేసి 'అబ్బో' అనిపించేలా చేయగల సామర్థ్యం ఆ ఇల్లాలికి వుంది. అందుకు అన్నివిధాలా సహకరించే విశాల హృదయం ఆయనకు ఉంది. మొత్తానికేమిటంటే, ఆ ఇల్లు వున్నంత ఇరుకుగా ఇంట్లోనివారు వుండరూ.. అని.

'అందరం పొద్దున పోతే ఏ రాత్రికో ఇంటికి చేరతాం. ఇంతకంటే పెద్దిల్లు ఎందుకు? దీన్నే సద్దలేక చస్తుంటే..' అని భార్యాభర్తలిద్దరూ అప్పుడప్పుడు తమ మనసులకు సర్ది చెప్పుకుంటారు.

'అందరం పొద్దున పోతే రాత్రెప్పుడో కొంపకు చేరతాం' అని మాట వరసకు అన్నారుగానీ, ఇంట్లోనివారంతా పొద్దున్నే పోరు. పిల్లలిద్దరూ మాత్రమే పొద్దున్నే స్కూలుకు వెళతారు. తరువాత కాసేపటికి ఆమె ఆఫీసుకు వెళ్లిపోతుంది. అతడు మాత్రం సాయంత్రం వెళతాడు. నైట్ డ్యూటీ అన్నమాట. పిల్లలు వచ్చేవరకూ ఎలాగూ వుంటాడు, అవకాశం వుంటే ఆమె వచ్చేవరకూ కూడా వుండి.. రెణ్నిమిషాలు కబుర్లు చెప్పి వెళతాడు. మళ్లీ ఏ తెల్లవారు జామునో ఇంటికి చేరుకుంటాడు. అందుకే అతడు పగలు నిద్రలో జోగుతూ వుంటాడు.

అలా జోగుతూనే వెళ్లి మెయిన్ డోర్ తెరిచేసరికి ముఖాన్న ఎవరో బక్కెట్టెడు నీళ్లు కుమ్మరించినట్టు వెలుతురు, వేడి ఒక్కసారిగా ముఖానికి తగిలాయి. దాంతో కళ్లు నులుముకుంటూ మరింత విలవిలలాడాడు. ఆవులిస్తూ చుట్టూ చూశాడు. బయట ఎవరూ కనిపించలేదు. ఇందాకటి ఏడుపూ వినిపించలేదు. కాస్త ముందుకు వెళ్లి కిందకు చూశాడు. ఒక ఫ్లోర్ దగ్గర ఎవరో వున్నట్టు అనిపించింది. కాసేపు ఆగాడు. ఏదో ఘర్షణ వినిపిస్తోంది. అతడు కాసేపు ఆలోచనలో పడ్డాడు – 'వెళ్లి ఆ గొడవేంటో చూడాలా? లేక లోపలకు వెళ్లి పడుకోవాలా?' అని. మళ్లీ తనే, 'ఒక ఆడకూతురు ఆపదలో వుంటే నేనెలా పడుకోగలను' అనుకుని గబగబా వెనక్కు వెళ్లి తన ఫ్లాట్ డోర్ దగ్గరగా వేసి, గడియ పెట్టి కిందకు దిగాడు.

రెండు ఫ్లోర్లు దిగాక, జనం అంతా కనబడ్డారు. అతడిని చూసి కొందరు పలకరింపుగా నవ్వారు. అతడూ నవ్వి, ఏమిటన్నట్టు చూశాడు. వారు బదులుగా ఓ ఫ్లాట్ వైపు చూశారు. అతడూ అటువైపు చూశాడు. లోపల్నించి కేకలు వినిపిస్తున్నాయి. భార్యాభర్తల గొడవని అతడికి అర్థమైంది. ఆ ఫ్లాట్‌కి ఇరువైపులా మూగినవారిలో ఇద్దరు సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు, ఒక హైస్కూలు బోటనీ టీచర్, మరో ప్రభుత్వ ఉన్నతోద్యోగి అయిన మహిళలు వున్నారు. ముగ్గురు మగ

పుంగవులు వున్నా.. గంభీరంగా ఆకాశం వైపు చూస్తూ నిలుచున్నారు. 'వీళ్లంతా చోద్యం చూడకపోతే, పోయి ఆపొచ్చు కదా' అనుకున్నాడతడు. ఎవరిలోనూ అటువంటి చొరవ కనబడకపోయేసరికి తానే ఆ పనికి పూనుకుందామని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆ ఫ్లాట్ వైపు అడుగులు వేశాడు.

ఇంతలో ఆ ఫ్లాట్ నుంచి ఒక ముసలాయన, ఒక నడివయసు ఆయన గుమ్మం దగ్గరకు వచ్చారు. ముసలాయన ఇంకొకాయాన్ని పట్టుకుని, ఆపుతూ.. 'వదిలెయ్ రా నాయనా, అది మాట వినదు. నీకు తెలియదూ దాని సంగతి.. మూర్ఖపు ముం..' అని అంటున్నాడు.

అప్పుడే ఫ్లాట్ దగ్గరకు చేరుకున్న అతడు 'ఏమైందండీ?' అని వారిని అడగాలనుకున్నాడు. ఇంతలో అనూహ్యమైన సంఘటన జరిగింది.

ఎడం చేత్తో ఎడమ కాలిపై నైటీని పైకి లాగి, కుడి కాలు ఎత్తి రివ్వున్న లోపల్నించి దూసుకొచ్చిన ఒక అమ్మాయి, శక్తికొద్దీ పైకి ఎగిరి నడివయసు ఆయన్ని గుండెలు మీద తన్నింది. వెంటనే అదుపు తప్పి ఆమె లోపల కింద పడిపోయింది. ఈయన గుండెలకు చెయ్యి అడ్డు పెట్టుకున్నాడు కాబట్టి కొంచెంలో ప్రమాదం తప్పింది. అయినా ఇద్దరూ బయట కారిడార్‌లోని గోడకు గట్టిగా గుద్దుకున్నారు. అతడు వెంటనే కదిలి ముసలాయన పడిపోకుండా పట్టుకున్నాడు. వాళ్లు సర్దుకుని, మళ్లీ తిరగబడే లోపల ఆమె లేచి వచ్చి, ''చావండి, ఇంకెప్పుడూ రావద్దు'' అంటూ అరిచి తలుపు వేసేసుకుంది. మగవాళ్లిద్దరూ తండ్రీ కొడుకుల్లా వున్నారు. కాళ్లూ, చేతులూ చూసుకుంటూ.. చొక్కాలు సవరించుకుంటూ లిఫ్ట్ లో దూరారు.

దాంతో సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు హాలులోంచి వెళ్లిపోయినట్టు చుట్టుపక్కల మూగినవారంతా నిశ్శబ్దంగా జారుకున్నారు. చేసేదేమీ లేక అతడూ అక్కడ్నించి నిష్క్రమించాడు.

మరుసటి రోజు సాయంత్రం అతడు లిఫ్ట్ లో దిగుతుంటే.. ఆ అమ్మాయి కలిసింది. ఆవేళ చూసినది 'ఈ అమ్మాయినేనా, కాదా?' అనుకుంటూ, అతడు సందేహంగా చూసాడు. మొబైల్ చూసుకుంటున్నదల్లా తలతిప్పి అతడి ముఖంలోకి చూసింది. దొరికిపోయిన దొంగలా అతడు చటుక్కున ముఖం తిప్పుకున్నాడు.

''ఏంటి చూస్తున్నారు?'' అంది ఆ అమ్మాయి మామూలుగా.

దానికే అతడు ఉలిక్కిపడ్డాడు. పట్టుచీర కట్టుకున్న ఆ అమ్మాయి ముఖం మీద భయపెట్టేట్టుగా పెద్ద బొట్టు పెట్టుకుంది. దానికితోడు చెంపల మీద గంథం. చేతిలో పూలు, అవీ వున్న బాస్కెట్. బహుశా ఏదో పూజకు వెళుతోందని అనుకున్నాడు. కళ్లు మాత్రం జ్యోతుల్లా ఎర్రగా మండుతున్నాయి, నిన్నటి గాయాన్ని గుర్తు చేస్తున్నట్టు.

అతడి కంగారును గమనించిన ఆ అమ్మాయి చొరవగా ''నిన్న గొడవ మీరూ చూసినట్టున్నారు'' అంది.

అతడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. అయోమయంగా 'ఆ.. ఆ..' అని మాత్రం అన్నాడు.

ఈలోగా లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకుంది. అతడు తనదారిన ముందుకు ఓ అడుగు వేశాడు.

ఆ అమ్మాయే చొరవగా ''ఏం లేదంకులు. ఇక్కడ అమ్మవారి గుడిలో పూజ చేపిద్దామని వెళ్తున్నా. పొద్దున్న కుదరలేదు. మీరేంటి అంకుల్ ఇప్పుడు ఫ్రెష్‌గా వెళుతున్నారు?'' అని నవ్వుతూ అడిగింది.

అతడు చిన్నగా నవ్వి ''నైట్ డ్యూటీ'' అన్నాడు.

''నేనూ అదే అనుకున్నా'' అని గలగలా నవ్వింది. ఆ నవ్వును బట్టి ఈమె ఆనందాన్ని, విషాదాన్ని కూడా హృదయపు లోతుల్లోంచి స్వీకరించే సున్నితత్వంతో వుందని అర్థం చేసుకున్నాడు. అలాగే నవ్వుతున్నప్పుడు అందరు ఆడపిల్లల్లా అలవాటుగా నోటికి చెయ్యి అడ్డుపెట్టుకోకపోవడం అతడు గమనించాడు. రక్తంలోనూ, జీన్స్ లోనూ ఇంకిపోయిన వాటిని ఈ తరం వాళ్లు ఆలస్యంగానైనా వదిలించుకుంటున్నారని సంతోషపడ్డాడు.

నవ్వడం అయ్యాకా, ''అదేంటి, ఇప్పుడంతా వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు కదా?'' అని ప్రశ్నించింది.

''మాది సాఫ్ట్ వేర్ కాదు తల్లీ–ఒళ్లో ఓ ల్యాప్ టాప్ వేసుకుని కదలకుండా ఇంట్లో కూర్చోడానికి'' అని కాస్త ఆగి ''నేను జర్నలిస్ట్ ని'' అన్నాడు.

ఆ అమ్మాయి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసి ''వావ్..'' అని గట్టిగా అరిచింది. వెంటనే ''అంటే అన్నీ మీకు ముందే తెలిసిపోతాయి'' అంది, తన నవ్వును పొడిగిస్తూ.

''అది ఒకప్పుడు. ఇప్పుడు వాట్సప్, యూట్యూబ్ వీడియోలు పెరిగిపోయాయి. మాకంటే ముందు వారికే తెలుస్తోంది'' అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ.

నైట్ షిఫ్ట్ ల గురించి, పని వత్తిడిల గురించి, ఈరకమైన టైమింగ్స్ తేడా వలన కుటుంబాన్ని సరిగా పట్టించుకోలేకపోవడం గురించి.. ఎప్పుడూ చెప్పుకునేదే ఆ అమ్మాయికీ చెప్పాడు.

ఇంక లేట్ అవుతోందన్నట్టు ఆ అమ్మాయి స్కూటీ దగ్గరకు నడిచి, ''ఓ పని చేయండి అంకుల్. అమీర్ పేట్‌లో శాప్‌గానీ ఏదైనా చేసేసి అటువైపు జంప్ అయిపోవచ్చేమో చూడండి. సాఫ్ట్ వేర్ కంపెనీలు ఏజ్ పెద్దగా పట్టించుకోవు. అదీగాక మనకు తెలిసినవాళ్లు ఎందులోనైనా వుంటారు కదా. ఎక్కడో అక్కడ చేరిపోతే, తరువాత వేరే కంపెనీల్లోకి ఈజీగా మారిపోవచ్చు'' అని సలహా ఇచ్చింది.

అతడు ఒక క్షణం గంభీరంగా చూసి ''ఎందులో వుండే కష్టాలు అందులో వుంటాయి. ధైర్యంగా ఎదుర్కోవాలి. జాగ్రత్తగా నెట్టుకు రావాలి. మనం వేలు పెట్టనంత వరకూ అన్నీ బంగారం పుట్టల్లా కనిపిస్తాయి. తీరా వేలు పెడితే అవీ చీమల పుట్టలే'' అని తన బైక్ వైపు నడిచాడతడు.

బహుశా అతడు గొంతు గంభీరంగా వుండటం వల్లేమో ఆ అమ్మాయి క్షణకాలం ప్రాన్పడిపోయి చూస్తుండి పోయింది.

★

కాలంతోపాటు లిఫ్ట్ కూడా కిందకూ మీదకూ కదులుతూనే వుంది.

వయసులో వున్నవారి జీవితాల్లో వచ్చినట్టుగా, నడివయసువారి జీవితాల్లో మార్పు రాదు.

అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా అతడు అదే లిఫ్ట్ లో ఎప్పటిలా మౌనాన్ని భుజాన వేసుకుని కిందకు దిగుతుంటే, ఒకావిడ పాపను తీసుకుని లిఫ్ట్ లోకి వచ్చింది. అతడిని చూసి ఆమె నవ్వింది. కానీ, అతడేమీ నవ్వలేదు. ఆమె ఫోన్లో ఏదో చూసుకుంటూ నవ్విందేమోనని అతడు పొరబడ్డాడు.

''ఏంటో చూసి కూడా చూడనట్టున్నారు'' అందామె.

వెంటనే అతడి బుర్రలో ఏదో వెలిగింది. ముఖం కూడా వెలిగింది. ''అంటే మీరు?'' అనే రొటీన్ క్వశ్చన్‌తో ఆశ్చర్యంగా చూశాడు.

''నేనే'' అందామె నవ్వుతూ. వెంటనే ఆమె మోకాళ్ల వరకూ కూడా లేని పాప గిరుక్కున్న వెనక్కు తిరిగి రెండు కళ్లు తిప్పుకుంటూ ఇద్దరినీ చూసింది.

సంతోషంతో వెలిగిపోతున్న ముఖంతో పాప బుగ్గ పట్టుకుని అటూఇటూ ఆడించి, ''మీ పాప భలే వుందండి'' అన్నాడు.

ఆమె కూడా నవ్వుతూ ''హమ్మయ్య గుర్తుపట్టారన్న మాట'' అంది.

అతడు గబుక్కున ''సో.. ఇప్పుడు హ్యాపీగా వుంటున్నారన్నమాట. గొడవలన్నీ సద్దుమణిగినట్టే?'' అనేశాడు. అనేయగానే 'అయ్యో, నోరు జారానే' అన్నట్టు నాలిక్కరుచుకుని 'సారీ' అనే భావంతో ఆమె వైపు బెరుకుగా చూశాడు.

''ఆ.. టూ అండ్ హాఫ్ ఇయర్స్ అయింది మ్యారేజ్ అయ్యి. తరువాత ఇది. తను కూడా మంచివాడే, ఫర్వాలేదు. ఆల్ హ్యాపీస్ అనుకోండి'' అని ఇంతకుముందులాగే హాయిగా నవ్వేస్తూ వెళ్లిపోయింది.

అతడూ నవ్వాడు. కానీ, కన్ఫ్యూజన్‌లో పడ్డాడు. 'మొన్న పెళ్లయిందంటుందేమిటీ? మరి అంతకుముందు గొడవ పడినది మొదటి భర్తతోనా? ఒకడిని వదిలేసి, మరొకడిని కట్టుకునే అంతగా డెవలప్ అయిపోయిందా, మన సమాజం?' అనుకున్నాడు. ఇతరుల వ్యక్తిగత విషయాలపై ఆసక్తి చూపుతున్నందుకు కొంచెం గిల్టీగా ఫీలయ్యాడు. కానీ ఆఫీసు పనిలో వున్నా ఆ ఆలోచనలు అతడిని వెంటాడాయి.

మరుసటి రోజు పొద్దున్న భార్యను ఆటో ఎక్కించి వస్తుంటే, ఆమె మళ్లీ ఎదురయ్యింది. పలకరింపుగా నవ్వి ''మీరేంటి ఇంత పొద్దున్నే?'' అన్నాడు–ఏదో ఒకటి అనాలి కదా అన్నట్టు.

''దాన్ని ప్లే స్కూల్లో పడేసి వస్తున్నా'' అందామె ఎప్పటిలాగే నవ్వుతూ.

''పాపం అండీ, ఇంత చిన్నప్పటి నుంచీ అలా ప్లే స్కూలుకు పంపెస్తే వాళ్లు తల్లి ప్రేమను చాలా మిస్సయిపోతారు''అని ఇంకా ఏదో అనబోయాడు.

ఆమె గొంతు పెంచి ''తల్లి ప్రేమా.. తొక్కా. పొద్దస్తమానం ఇంట్లో వుంటే నా ప్రాణం తీయడం తప్ప దానికేం తెలుస్తుంది. అక్కడ నలుగురు పిల్లలుతో కలిసి ఆడుకుంటే అన్నీ తెలుస్తాయి'' అంది ఠక్కున.

ఆమె అంత కఠినంగా మాట్లాడుతుందని అనుకోని అతడు గతుక్కుమన్నాడు. ఏమీ అనలేక మౌనం వహించాడు. ఆమె ఫ్లోర్ రాగానే లిఫ్ట్ నుంచి వెళుతూ ''రండి, కాఫీ తాగి వెళుదురుగాని'' అని ఆహ్వానించింది.

అతడు మొహమాటంగా ''ఏం వద్దులెండి, పడుకోవాలి. లేకపోతే నిద్ర సరిపోదు'' అన్నాడు.

''ఆం.. ఏం ఫర్వాలేదు. కావాలంటే ఓ గంట ఎక్కువ పడుకోండి. సాయంత్రం దాకా ఎలాగూ ఏ పనీ లేదుగా?'' అంది చొరవగా.

'కట్టుకున్నదానిలా మధ్యలో దీని పెత్తనం ఏంట'ని మనసులో అనుకున్నాడు. కానీ, ఆమె జీవితంలోని సస్పెన్స్ తెలుసుకోవాలని ఉరకలువేస్తున్న మనసుతో వడివడిగా ఆమె వెనుకే అడుగులు వేశాడు.

అతడు హాల్లో సోఫాలో కూర్చుని మొబైల్ చూసుకుంటుంటే, రెణ్నిమిషాల్లో కాఫీ పట్టుకుని వచ్చిందామె.

అతడి మనసు ఆమె గురించి తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతోందిగానీ సంస్కారం అడ్డమొస్తోంది. ఆమె విషయానికి వస్తే ఊరికే సరదాగా రమ్మని పిలిచిందిగానీ, ప్రత్యేకమైన కారణమేమీ లేదు. ఎవరితో ఒకరితో ఏదో ఒకటి మాట్లాడక పోతే ఆమెకు బోర్ కొడుతుంది. 'ఈయనేంటో మూగనోము పట్టినట్టు మౌనంగా కూర్చున్నాడు' అనుకుంది. ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగి తేలుతూనే కాఫీ తాగడం పూర్తి చేశారు. కప్పు టీపాయ్ మీద పెడుతుండగా అతడి బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

''అన్నట్టు ఆయన కనబడటం లేదు?'' అన్నాడు.

''తను సింగపూర్ వెళ్లారు. ఇంకో టూ డేస్‌లో వచ్చేస్తారు. యాక్చువల్‌గా మేము ఇంకా ముందే ఇక్కడకు రావాల్సింది. కానీ, టెనెంట్స్ ఖాళీ చేసేసరికి లేట్ అయ్యింది. తరువాత రిపేర్లూ అవీ చేయించుకుని షిఫ్ట్ అయ్యేసరికి లేట్ అయ్యింది. చెప్పాలంటే రియల్లీ నేను కూడా ఈపాటికే జాయిన్ కావాలి. కానీ, పాప కాస్త సెట్ అయ్యేదాకా అగుదామని టైమడిగా'' అని మాటలకు కామా పెడుతున్నట్టు నవ్వి, ఆగింది.

'రాజు లేనప్పుడూ సారంగో..' అనుకున్నాడతడు మనసులో. ఇంతలో ఆమె ఎగిరి తన్నిన దృశ్యం గుర్తొచ్చి అతడి హుషారు కాస్తా హుష్ అని ఎగిరిపోయింది.

అతడి ఆలోచనలతో సంబంధం లేకుండా ''నేను ఇంగ్లీషు ఎక్కువ మాట్లాడేస్తున్నా కదా? అలవాటైపోయింది. నేనింకా నయం, మా ఫ్రెండ్స్ అయితే చాలా గోరం'' అంది ఎప్పటిలా గలగలా నవ్వేస్తూ.

'నీ ఇంగ్లీషు ఎవడిక్కావాలి. నీ సంగతి కావాలి గానీ' అని మనసులో అనుకుని పైకి మాత్రం ఓ చిరునవ్వు విసిరాడు.

''అన్నట్టు మీకు తన్ని చూపించలేదు కదూ'' అంటూ మొబైల్ పైకీ కిందకీ గీకి ఓ దగ్గర ఆగి, అతడికి అందించింది.

అందుకుని చూశాడతడు. టీ షర్ట్, షార్ట్ హెయిర్‌లో సరదాగా నవ్వుతూ, బావున్నాడు. అదే మాట చెప్పాడు. ఇంక వెళదామనుకున్నాడు. కానీ, సస్పెన్స్ తీరకుండా ఎలా వెళ్లడం అని మదన పడుతూ, చివరగా ఓ మాటన్నాడు.

''మొత్తానికి అర్థమయ్యిందేమిటంటే మీకు వంట బాగా వచ్చన్న మాట. మీ చేతి వంట కారణంగా ఆయన చాలా వయసు తగ్గి, హుషారుగా తయారయ్యారు'' అన్నాడు.

''ఏదో వచ్చు. అయినా, ఇంతకు ముందటి వారు వండినట్టు నేను వండలేను. ఒకవేళ అంత ఇదిగా వండినా, ఎంజాయ్ చేస్తూ తినేవాళ్లు ఎవరున్నారండి. ఫోన్ చూసుకుంటూనో, టీవీ చేసుకుంటూనో.. ఏం తిన్నామో తెలీకుండానే లాగించేస్తుంటారు. అందుకే మాలాంటి వాళ్లకి వంట సులువైపోయింది'' అని ఆమె పెద్దగా నవ్వింది.

తన పాచిక పారనందుకు ఒక్క క్షణం చింతించినా, చివరి అస్త్రంగా.. ''అంటే, అప్పటి కంటే ఇప్పుడు ఓ పదేళ్లు వయసు తగ్గినట్టు కనబడుతుంటే అలా అన్నా'' అనేశాడు ధైర్యం చేసి.

ఆమె ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి, ''అప్పటి కంటే.. అంటే మీరెప్పుడు చూశారు ఆయన్ని?'' అని ప్రశ్నించింది.

అతడు గతుక్కుమన్నా, పైకి తేలకుండా, ''అదే.. ఆ గొడవైనప్పుడు..'' అన్నాడు.

''ఓహ్.. అప్పుడా? అప్పుడు మా ఆయనెక్కడున్నాడు?'' అని ఆమె ఎదురు ప్రశ్న వేసింది.

'చచ్చింది గొర్రె' అని తనను తాను తిట్టుకున్నాడు. ఏం చెప్పాలో తెలియక, అటూ ఇటూ చూశాడు.

కాసేపటికి ఆమెకి విషయం అర్థమైంది.

''ఓకే ఓకే.. ఆవేళ గొడవైనది మా ఆయనతో అని మీరంతా అనుకున్నారా?'' అందామె.

అతను 'అవును' అన్నట్టుగా చూశాడు. 'కాకపోతే, ఇంకెవడితో గొడవ పడతారు మీ ఆడాళ్లు' అని మనసులో అనుకున్నాడు.

''ఆ గొడవంతటికీ కారణం మా వదిన. ఎలాగంటే, నాకేమో చదువుకోడమంటే ఇష్టం. బీటెక్ అయిపోయిన తరువాత ఎంబీయే చెస్తానంటే, చదివింది చాల్లే అందామె. 'నువ్వెవరు చెప్పడానికి?' అని నేను. అంతేకదా? ఆమెవరు నాకు చెప్పడానికి? మా డాడీకి నేనంటే ఇష్టమేగానీ, 'అన్నయ్య మాట వినొచ్చు కదా?' అంటారు. అంటున్నది అన్నయ్యకాదు,వదిన అని నేను. బాగా కొట్లాడుకున్నాం. మామూలుగా నేనేమీ అంత సీరియస్‌గా లేను. కానీ, వాళ్లు వద్దంటే.. నాకింకా పట్టుదల పెరిగింది. మీరే చెప్పండి, నేను చదువుకుంటే దానికేంటి? లేకపోతే దానికేంటి? అదేమైనా తన పుట్టింటికెళ్లి తెచ్చి నాకు పెడుతోందా? ఇగ మామూలే.. మీకు తెలుసు కదా. అన్నేమో వదిన మాటే ఇంటాడు. మా నాన్నేమో అన్నయ్య మాట వినమంటాడు. నేనెవరి మాటా వినను, నా ఇష్టం నాదే- అన్నా. అయితే, నువ్వు సంపాదించుకున్నప్పుడే అది చెల్లుబాటవుతుందని అన్నారందరూ. ఒక వన్ మంత్ కష్టపడ్డా. జాబ్ కొట్టా. మంచి కాలేజీలో చేసానండీ, బీటెక్-ఎంతసేపు జాబ్ రావడానికి? జీతం వస్తోంది కదా, నేను జాబ్ చేస్తూనే చదువుకుంటా అంటే-ఉద్యోగం వచ్చిందని పొగరా? అని మళ్లీ గొడవ చేశారు. అసలు ఏంది ఈళ్ల బాధ అని ఆలోచిస్తే.. అప్పుడు అర్థమైంది. మా వదిన కూడా బీటెక్ చేసింది. తరువాత ఏదో చేద్దామనుకునే సరికి పెళ్లయ్యింది. మా అన్న చదువుకోడానికి అడ్డం పడలేదుగానీ, కడుపులో బిడ్డ అడ్డం పడింది. చాలా గడబిడ అయ్యింది. ఒకవైపు ఆమె ఆరోగ్యం, మరోవైపు చంటి పిల్ల.. కిందమీద

అయినారు. దానికి అదీ కుళ్లు. నేను ఇప్పుడు ఏమైనా చేస్తే తనని మించిపోతా గదా. అది ఇష్టం లేదు. వెంటనే నేను ఇంట్లోంచి వెళ్లిపోతానని గొడవ చేశా. నాన్నేమో 'పెళ్లి చేసుకుని అలాగే పోదువుగాని' అన్నాడు. పెళ్లిళ్లు అంత సులువుగా అయితాయా. నేనేమో మొండికి పడితే, నాన్నే ఈ ఇల్లు చూసి, లోన్‌కు అన్ని ఏర్పాట్లు చేశాడు. గృహప్రవేశం చేసినప్పుడు అందరొచ్చారు, మా వదిన తప్ప. మా అన్నను కూడా రాకుండా చేసింది. కాకపోతే, పిచ్చోడు సార్, పొద్దున్న గృహప్రవేశం చేశాం. సాయంత్రానికి ఎట్లాగో వచ్చేశాడు. నేనేమీ అనలే. వాడే అటూఇటూ జూసి, నిశ్శబ్దంగా వచ్చి రెండు లక్షలకు చెక్ చేతిలో పెట్టాడు సార్. పెడుతూనే 'సారీనే' అంటూ బొలబొలా ఏడ్చేశాడు సార్'' అంటూ తన వాక్ప్రవాహానికి వెక్కిళ్లు అడ్డం పడటంతో ఆగింది. వెనకాల వున్న సోఫా పిల్లో తీసుకుని ముఖానికి అడ్డంగా పెట్టుకుంది.

ఆమెలో అన్ని కోణాలు వున్నాయని తెలియని అతను విస్తుపోయి చూస్తూ కూర్చున్నాడు.

ఓ క్షణం తర్వాత ఆమె తల పైకెత్తి, గట్టిగా ముక్కు ఎగబీల్చింది.

''వద్దురా, చెక్ తీసుకుని పో. వదిన ఏమైన అంటుంది అన్నా. వాడు వింటేనా? 'మీ వదినే ఇయ్యమంది, ఫరవాలే' అన్నాడు. ముందు ముహూర్తానికి నన్ను పంపలేదు గానీ, మళ్లీ దానికే గిల్టీగా అనిపించిందేమో, పోయిరా అనింది' అని చెప్పాడు. నేనేమో జాబ్ చేసుకుంటూ, ఎంబీయేకి అప్లయ్ చేశా. అలాగే యూఎస్ వెళ్లడానికి కూడా ప్రిపేర్ అవుతున్నా. అమ్మానాన్నా రెండ్రోజులకు ఒకసారి వచ్చిపోతుండేవారు. అన్న కూడా వారానికోసారి వచ్చేవాడు. కానీ, అందరికీ లోన ఇరకాటంగానే ఉండింది–నేనిలా ఒంటరిగా వుండటం. చివరికి ఆ గొడవా, ఈ గొడవా వచ్చి–చివరకు నా మీద పడ్డారు. ఆడపిల్ల అలా ఒంటరిగా ఒక్కత్తే వుంటే మన పరువేం గావాలని. 'పెళ్లి చేసుకో, నీ జోలికి ఎవరూ రార'ని నాన్న. 'ఇంటికొచ్చెయ్' అని అన్న. యూఎస్ పోయేది కాలేదు. మళ్లీ ట్రై చేద్దామనుకున్నా. ఎంబీఏ పూర్తి కాలేదు. నేనేమీ వాళ్లని ఒక్క రూపాయి అడగలేదు. అయినా, వాళ్ల టార్చర్ మానలేదు. అలా ఒకరోజు వాళ్లు వచ్చి గొడవ చేసినప్పుడు నేను తిరగబడక తప్పలేదు. చిన్నప్పటి నుంచి ఎప్పుడూ లేంది మా నాన్న చెయ్యెత్తారు. దాంతో నాకు టెంపర్ లూజ్ అయ్యింది. మా అన్న కూడా కోపంగా నా చెయ్యి ఇట్ల వెనక్కి విరిచిండు. ఇక చూసుకోండి.. నాకసలు ఒళ్లు తెలియలేదు'' అంటూ ఆగింది.

ఆమె ముఖంపై ఒక అతిశయం తాండవమాడుతోంది. ఆమె శరీరం అలనాటి జ్ఞాపకాలతో ఊగిపోతోంది. వాటన్నిటినీ అదుపు చేసుకోవడానికి కొంత సమయం పట్టిందామెకు.

''యూఎస్‌కు పోయేది మళ్లీ ఫెయిల్ అయ్యా. కానీ, ఎంబీయే పూర్తయ్యింది. మంచి జంప్ వచ్చింది. బయటోళ్ల సంగతి సరే, మా అన్నయ్య, వదినలను చూసిన తర్వాత పెళ్లంటేనే.. వామ్మో అనిపించింది. కానీ, ఆ వేళ మీరన్నారు కదా. అన్నిటిలో లోపాలుంటాయి. ఎదుర్కొంటూ పోవాలని అందుకే పెళ్లి చేసుకుంటానని నాన్నకు చెప్పా. అంతే, టక్కున చేసేశారు. మా ఆయనకు ముందే చెప్పా. 'నువ్వేమైనా ఎక్కువ చేసావంటే విడిపోతా' అని. కాకపోతే, ఇప్పటి వరకు అంత సీన్ ఏమీ జరగలేదు. మీరే చూశారు కదా, మంచోడే ఫరవాలేదు. బానే వుంటాడు'' అని ఆమె నవ్వుతూ ఆపింది.

ముందున్న సస్పెన్స్ విడిపోవడం కంటే, మరింత గందరగోళం నెలకొనడంతో తల గోక్కుంటూ ''ఇక వెళ్తానండి, మళ్లీ రాత్రి డ్యూటీ వుంది'' అని అక్కడ్నించి బయటపడ్డాడు.

ఇంటికి వచ్చి మంచంపై వాలాకా మళ్లీ ఆమె గుర్తొచ్చింది. 'అమ్మాయిగా కంటే, అమ్మయ్యాక రంగు తేలింది' అనుకున్నాడు. అటూఇటూ దొర్లుతూ ఆమె గురించి ఆలోచించసాగాడు. మామూలు అందరిలాంటి ఆడకూతురే అనిపించింది ఒకరకంగా. 'కాదెహే, అది మామూలు ఆడదేంటి?' అనిపించింది ఇంకోరకంగా.

'దేన్నయినా సాధించాలనే పట్టుదల గల ఆధునిక యువతా? ఎవరినైనా ఎదిరించగల తెంపరా? దుందుడుకు కూతురా? గయ్యాళి భార్యా? క్రమశిక్షణ గల తల్లా? సంప్రదాయాల కల్పవల్లా? ఏమనుకోవాలి ఈమెను? ఇన్ని వేరియేషన్సా?' అని అటూఇటూ పొర్లుతూ నిద్రమత్తులో ఏదో దీర్ఘంగా విశ్లేషించుకుంటూ వుండగా, అనుకోని సంఘటన జరిగింది.

ధాం అంటూ పెద్ద చప్పుడై, కళ్లు మిరుమిట్లు గొలిపే వెలుతురుతో–అచ్చం సినిమాల్లోలా–అంతరాత్మ ప్రత్యక్షమైంది.

టక్కున లేచి కూర్చుని భయం భయంగా చూశాడు.

''అనేక జీవన వైరుధ్యాలను విశ్లేషించి ఏదో ఒక గాటన కట్టెయ్యాలన్న దురద ఎందుకురా నీకు? ఆమె సంగతి అలా వుంచు, ఇంతకీ నువ్వెవరో నీకు తెలుసా? ఆమెకే కాదు, నీకూ ఎన్నో రూపాలున్నాయని నీకు తెలీదా? ఇంగిత జ్ఞానం లేకపోతే సరి'' అని చీవాట్లు పెట్టి అది అంతర్ధానమైపోయింది.

అతడు బిక్కచచ్చిపోయి, వెంటనే వెనక్కువాలి, బోర్లా తిరిగి పడుకుని నిద్దట్లో తలదూర్చేశాడు. యథావిధిగా ఆ గదిని చీకట్లు ఆక్రమించేశాయి.

-X-

,

COMMENTS